# తండాల తలరాత మార్చిన మహనీయుడు సీఎం కేసీఆర్



కాంగ్రెస్, బీజేపీకి చెందిన గిరిజనులకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

- అందుకే గిరిజనమంతా ఏకమై బీఆర్ఎస్‌కు జై కొడుతుండ్రు
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- మూకుమ్మడిగా గులాబీ పార్టీలో చేరిన వస్రాంతండావాసులు

సూర్యాపేట టౌన్, సెప్టెంబర్ 30 : తండాల తలరాత మార్చిన మహనీయుడు మన ముఖ్యమంత్రి కేసీఆర్ అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. స్వరాష్ట్రంలోనే తండాలు గ్రామపంచాయతీలుగా మారి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేసిందన్నారు. అందుకే అన్ని ప్రాంతాలతోపాటు తండాలకు తండాలు ఏకమై బీఆర్ఎస్ పార్టీకి జై కొడుతున్నట్లు తెలిపారు. గత తొమ్మిదేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పట్టణంలోని 5, 6 వార్డుల్లోని వస్రాంతండాకు చెందిన గిరిజనులు కాంగ్రెస్, బీజేపీ నుంచి 160 మంది శనివారం క్యాంపు కార్యాలయంలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఉమ్మడి పాలకుల హయాలంలో అన్ని విధాలుగా ఆగమై ఏ మాత్రం అభివృద్ధికి నోచని తండాలతోపాటు మారుమూల ప్రాంతాలను సైతం స్వరాష్ట్రంలో, సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి వాటి రూపురేఖలు మార్చుకున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాలు, తండాలు, మారుమూల ప్రాంతాలకు సైతం రోడ్లు, విద్యుత్ దీపాలతో వెలుగులు విరజిమ్ముతున్నాయన్నారు. అంతేకాకుండా నిరంతం విద్యుత్, పుష్కలంగా తాగు, సాగునీరు అందుతుండటంతో నాడు దండుగ అనుకున్న వ్యవసాయం నేడు పండుగలా మారి ప్రతి ఇంట సిరులు కురిపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు రామగిరి నగేశ్, సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన చేరికల్లో ధరావత్ జోగ్యానాయక్, టీకంనాయక్, లాలూనాయక్, బుబ్లూ నాయక్, హరియా, రెడ్యా, విజయ, అచ్చమ్మ, పార్వతి, మాధవి, సైదమ్మ, గంగమ్మ, కవిత, శాంతితోపాటు 160 మంది బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లీలాలింగానాయక్, బాషామియా, నాయకులు విజయాచక్రూనాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి

- మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి
- పులిపలుపులకు చెందిన 30 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక



కాంగ్రెస్ కుటుంబాలకు చెందిన వారికి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మునుగోడు, సెప్టెంబర్ 30 : సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పులిపలుపుల గ్రామానికి చెందిన 30 కాంగ్రెస్ కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్న విషయాన్ని ప్రజలు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని అధోగతి పాలుజేసే కుట్రలు పన్నుతున్నాయని, ఆ పార్టీలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బీఆర్ఎస్‌లో కొత్త, పాత తేడా లేకుండా పార్టీ కోసం పనిచేసే వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారిలో నకరేకంటి రోషయ్య, వరంగంటి సైదులు, చిన్న సైదులు, సింగం లింగస్వామి, ముత్యాలు, నరిసింహ, యాదయ్య, ఖమ్మంపాటి సైదులు, గోలి లింగయ్య, కాశయ్య, హుస్సేన్, వరంగంటి శ్రీరాములు, ఈదులకంటి మారయ్య, మునుగోటి సత్యనారాయణ ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, సర్పంచ్ పందుల మారయ్య, ఎంపీటీసీ బొల్గూరి లింగయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బండ పురుషోత్తంరెడ్డి, పోలగోని సైదులు, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, దోటి కరుణాకర్, వరంగంటి శకంర్, జనగాం నర్సింహ పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌దే విజయం

- నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్
- గుర్రంపోడు మండలం నుంచి భారీగా బీఆర్ఎస్‌లో చేరికలు



హాలియా క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, సెప్టెంబర్ 30 : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌దే విజయమని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. గుర్రంపోడు మండలం కొప్పోలు, పల్లిపహాడ్, తానేదార్‌పల్లి, మైలాపురం, జిన్నాయిచింత, వెలమోనిగూడెం, కోతులాపురం గ్రామాలకు చెందిన 300 మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు శనివారం హాలియాలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు. నాగార్జున సాగర్ నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నేటికీ రూ.600 పింఛన్ మాత్రమే అమలు చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల వేళ కాంగ్రెస్, బీజేపీ నాయకుల తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గుర్రంపోడు ఎంపీపీ మంచుకంటి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ వజ్జ రామేశ్వరీ ధనుంజయ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజ్జెల చెన్నారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల వెంకన్న, రాష్ట్ర నాయకులు పోలేని ముత్యాలు, దైద శ్రీనివాస్‌రెడ్డి, ఐతగోని కృష్ణగౌడ్, చిలకరాజు అంజయ్య, సర్పంచ్ కామెర్ల నర్సింహ, బుర్రి యాదయ్య, మర్రి సైదులు, యాదగిరి, కేశబోయిన అంజయ్య, వార్డు సభ్యులు బోన శంకర్‌రావు, మామిడి శ్రీను, చిలకరాజు నాగరాజు, గన్నమోని యాదగిరి, నడ్డి యాదయ్య, కంచర్ల ఈశ్వర్ పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో నిత్య తిరుకల్యాణోత్సవం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 30 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి నిత్య తిరుకల్యాణోత్సవం శాస్ర్తోక్తంగా జరిగింది. శనివారం ఉదయం స్వామివారికి సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు కల్యాణమూర్తులకు గజవాహన సేవలు నిర్వహించారు. అనంతరం వెలుపలి ప్రాకార మండపంలో తూర్పునకు అభిముఖంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణోత్సవం జరిపారు. సుమారు గంటన్నర పాటు సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. స్వామివారి నిత్యోత్సవాలు తెల్లవారుజాము నుంచే మొదలయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో నారసింహుడిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి, దర్బార్ సేవలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా కొనసాగాయి. స్వామివారి దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయం సందడిగా మారింది. స్వామివారిని సుమారు 11 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.20,31,987 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత తెలిపారు.

# సకల జనుల చూపు బీఆర్ఎస్ వైపు

- హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి
- కాంగ్రెస్ నుంచి పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరిక

హుజూర్‌నగర్, సెప్టెంబర్ 30 : దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి సకల జనులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణంలోని 13వ వార్డు అంబేద్కర్ కాలనీ కి చెందిన 100 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సైదిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్టాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా మార్చిన గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. రైతులకు 24 గంటల విద్యుత్, రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాల ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. విపక్షాలు ఎన్ని అవరోధాలు సృష్టించినా వచ్చే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు చిట్యాల అమర్‌నాథ్ రెడ్డి, వార్డు ఇన్‌చార్జి భూక్యా చంద్రమౌళి, అంబేద్కర్ కాలనీ వార్డు అధ్యక్షుడు మీసాల కిరణ్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మూసీ ప్రాజెక్ట్ గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

# 3 గేట్ల ద్వారా మూసీ ప్రాజెక్ట్ నీటి విడుదల

కేతేపల్లి, సెప్టెంబర్ 30 : మూసీ ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో పెరిగింది. శుక్రవారం రాత్రి 1,213 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో శనివారం 1799.40కు పెరిగింది. దాంతో 3 క్రస్ట్ గేట్ల ద్వారా 1576.14 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645(4.46 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 644.48 (4.33 టీఎంసీలు)అడుగులుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. జలాశయం నుంచి కుడి కాల్వకు 243.90 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 268.29 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ నుంచి మొత్తం 2,170.12 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతున్నది. మూసీ ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నందున రైతులు, మత్స్యకారులు, గొర్రెలు, మేకల కాపరులు నదిలోకి వెళ్లవద్దని అధికారులు సూచించారు.

### శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు..

శాలిగౌరారం : శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ ఏఈ రాములు తెలిపారు. నీటి ప్రవాహ మార్గంలోని తుర్కపల్లి వద్ద చెత్త పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుపడుతుండడంతో కూలీల సాయంతో దానిని తొలగింపజేసినట్లు చెప్పారు. దాంతో నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు ఆయకట్టు కింది రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.